# కరీంనగర్ సూర్య

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల

ఆదివారం 19 నవంబర్ 2023 8 పేజీలు


## ప్రచారంలో అస్వస్థతకు గురైన ఎమ్మెల్సీ కవిత

**సూర్య, రాయికల్**

జగిత్యాల నియోజకవర్గం లోని రాయికల్ పట్టణ, మండల గ్రామాలలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు మద్దతుగా ఎమ్మెల్సీ కవిత శనివారం ప్రచారం నిర్వహించారు.కాగ షెడ్యూల్ ప్రకారమే ఉదయం పూటనే కార్నర్ రోడ్ షో సమావేశాలకు హాజరైన ఎమ్మెల్సీ కవిత,మొదట మైతాపూర్ గ్రామంలో ప్రసంగించి, కార్యకర్తలలో ప్రజలల్లో ఉత్సాహాన్ని నింపుతూ రాయికల్ పట్టణం గుండా రోడ్ షో నిర్వహిస్తూ ఇటిక్యాల గ్రామం వరకు ప్రచారం నిర్వహించారు. ఇటిక్యాల గ్రామంలో (వివరాలు 2లో)



## భూకబ్జాలు తప్ప మీకేం తెలుసు..?



- ప్రజల కోసం ఎన్నడైనా పోరాడి జైలుకుపోయారా?
- కరీంనగర్ పై అవగాహనే లేని వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థి
- లక్ష ఫోన్లు,ఓటుకు రూ.10 వేలును నమ్ముకున్న గంగుల
- మీ సమస్యలపై పోరాడి జైలుకు పోయిన చరిత్ర నాది
- ఓటుతో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు బుద్ధి చెప్పండి
- బీజేపీ కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ పిలుపు
- కమాన్ పూర్ లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన బండి సంజయ్

**సూర్య,కరీంనగర్ రూరల్** 2లో

## జనవరి నుంచి కొత్త రేషన్‌కార్డులు

- యాభై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ మన బతుకులు చీకటి మయం చేసింది
- బీజేపీ, కాంగ్రెస్‌లు మోసగాళ్ల పార్టీలు
- అందరినీ దోచుకొని బండి సంజయ్ కోట్లు సంపాదించాడు
- ఓటుకు ఇరవై వేలు ఇద్దామని వస్తున్నాడు
- డబ్బు మనదే తీసుకోండి..కారు గుర్తుకు ఓటు వేయండి
- కోట్ల రూపాయల నిధులతో గ్రామీణ రహదారులన్నీ పూర్తి చేశా
- దుబ్బపల్లిని దత్తత తీసుకుంటున్నా...
- అభివృద్ధి బాధ్యత నాదే...
- బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గంగుల కమలాకర్

**సూర్య,కరీంనగర్ రూరల్** 2లో



## ఆదరించి ఆశీర్వదిస్తే మీ సేవకుడిలా పని చేస్తా

**- బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్**

**సూర్య, మంథని**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదేండ్ల కాలంలో మంథని నియోజకవర్గంలో అనేక అభివృద్ధిపనులు, సంక్షేమ పథకాలు అమలు చేసి తాము ప్రజల ముందుకు వస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బాగంగా శనివారం మంథని నియోజక వర్గ గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు.అనంతరం మధు మాట్లాడుతు బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంథని నియోజక వర్గ మండలంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి బాటలువేశామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో మారుమూల గ్రామాల అభివృద్ధిని పట్టించుకో లేదని, కనీసం రోడ్ల సౌకర్యం కూడా కల్పించలేని దుస్థితి ఉండేదన్నారు. తాను ఓడిపోయినా అభివృద్ధి పనులు, సంక్షేమ (మిగతా 2లో)



## హుజురాబాద్‌కు ఈటల రాజేందర్ చేసిందేమీ లేదు...!?

**- బిజెపి, బిఆర్ఎస్ లు దొందు దొందే**

**- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్**

**సూర్య, హుజురాబాద్ రూరల్**

హుజురాబాద్ నియోజకవర్గంకు ఇప్పటి వరకు ఏడుసార్లు ఎమ్మెల్యే గా ఎన్నికైన ఈటల రాజేందర్ చేసింది ఏమీ లేదని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ బాబు అన్నారు. శనివారం హుజురాబాద్ మండలంలోని పోతిరెడ్డి పేట, వెంకట్రావుపల్లి, సిర్సపల్లి, రాంపూర్, జూపాక, బోత్తలపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు దొందు దొందేనని, బిజెపి కి ఓటు వేస్తే కేసిఆర్ కు ఓటు వేసినట్లేనని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే భవిష్యత్తు బాగుంటుందని, అధికారంలోకి వచ్చిన 100 రోజులలో హామీలు అమలు చేస్తామని అన్నారు. టిఆర్ఎస్, బిజెపి నాయకులు కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయదని అసత్యపు (మిగతా 2లో)



# భూకబ్జాలు తప్ప మీకేం తెలుసు?

**సూర్య,కరీంనగర్ రూరల్**

కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థికి భూకబ్జాలు తప్ప తెలుసు? అసలు ఆయనకు కరీంనగర్ పైన అవగాహనే లేదని. ఆయనతోపాటు బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ ఏ ఒక్కరోజైనా కరీంనగర్ ప్రజల కోసం పోరాటాలు చేశారా? ఏన్నడైనా జైలుకు పోయారా?"అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. తాను నిరంతరం ప్రజల కోసం పోరాడానని, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, మహిళలుసహా అన్ని వర్గాల ప్రజల పక్షాన పోరాడి జైలుకు వెళ్లానని చెప్పారు. తాను ప్రజల కోసం కొట్లాడితే... తనకు కేసీఆర్ ఇచ్చిన గిఫ్ట 74 కేసులని అన్నారు. ప్రజల కోసం తన కుటుంబాన్ని కూడా పక్కకుపెట్టి పోరాడానని, ఏనాడూ భార్యాపిల్లలకు పూర్తి సమయం కేటాయించలేదని చెప్పారు. ప్రజల కోసం, ధర్మం కోసం పోరాడేవారిని గెలిపించకపోతే... ఇకపై పేదల పక్షాన పోరాడేవాళ్లు వెనుకంజ వేసే ప్రమాదముందని హెచ్చరించారు. ఎన్నికల్లో భాగంగా శనివారం కమాన్ పూర్ గ్రామంలో ప్రచారం చేసిన బండి సంజయ్ కుమార్, ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ నిన్న కేసీఆర్.... కరీంనగర్ వచ్చి ఏం మాట్లాడిండు... 10 ఏళ్లలో ఏం చేసిండో చెప్పిండా? ఏమీ లేదు... నాకు మతపిచ్చి అట... ఒకసారేమో నా తల ఆరు ముక్కలు చేస్తనంటడు... ఆయనకు నేను చెప్తొక్కటే.....పేదలకు రేషన్ కార్డులిచ్చి నా తలనరుకు... పేదలకు ఇండ్లు కట్టించి ఇవ్వు నా తల నరుక్కుంటా. నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు, నిరుద్యోగ భ్రుతి ఇవ్వు.. నా తల నరుక్కుంటా... పోనీ పంట నష్ట పరిహారం, కౌలు రైతులకు రైతు బంధు ఇవ్వు.. నా తల నరుక్కుంటా...భరిస్తా...అన్నారు,10 ఏళ్లలో నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం ఇవ్వని కేసీఆర్ ... తన కుటుంబంలో మాత్రం అందరికీ పదవులిచ్చుకున్నడు.. మనవడికి వయసు లేదు కానీ... అతనికి కూడా పదవి ఇచ్చే వాళ్లు... ప్రజలు కేసీఆర్ పాలనపట్ల విసిగిపోయిర్రు. డిసెంబర్ 4 నుండి కేసీఆర్ మాజీ సీఎం కాబోతున్నడని పేర్కొన్నారు.కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థికి కరీంనగర్ నియోజకవర్గం గురించి ఏమీ తెల్వదు. ఆయనకు పేదలకు ఏం చేయాలో, కరీంనగర్ ను అభివృద్ధి ఎట్లా చేయాలో తెల్వదు. తెలిసిందల్లా భూకబ్జాలు చేయడమే.. ఆయనపై ఉన్నవన్నీ కబ్జా కేసులేనని తెలిపారు. గంగుల కమలాకర్, పురమళ్ల శ్రీనివాస్ ఎన్నడైనా మీకోసం కొట్లాడి జైలుకు పోయారా? మీ లెక్క నాకూ భార్యాపిల్లలున్నరు. మీరు హోటల్ కు, ఫంక్షన్లకు, సినిమాలకు పోతారు.. కానీ నేను భార్యాపిల్లలతో సినిమాలకు వెళ్లలేదు. ఫంక్షన్లకు పోలేదు.. మీకోసం కొట్లాడుతుంటే.. ప్రత్యర్థులు ఎవరు ఎప్పుడు ఏం చేస్తారో తెల్వని పరిస్థితి... పాతబస్తీలో సభ పెడితే నా భార్యాపిల్లలను చంపుతామని బెదిరించారు. ప్రజల కోసం ఎంతకైనా తెగించాలని నా కుటుంబాన్ని పక్కనపెట్టి సభ పెట్టిన అని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడుతున్న నా మీద 74 కేసులున్నయ్. అవన్నీ ఎవరి కోసం? మీకోసం కొట్లాడిన. పేదల సమస్యలపైన, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, విద్యార్థుల కోసం కొట్లాడితే కేసీఆర్ ఇచ్చిన గిఫ్ట్ 74 కేసులు... ఒక్కసారి ఆలోచించండి... ఎంపీగా పార్లమెంట్ నియోజకవర్గానికి రూ.8 వేల కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చిన. కరీంనగర్..జగిత్యాల, కరీంనగర్.. వరంగల్ జాతీయ రహదారి నిర్మాణం కోసం నిధులు తెచ్చిన. స్మార్ట్ సిటీకి నిధులు తెచ్చిన. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి నిధులన్నీ కేంద్రానివేనని తెలిపారు.

# జనవరి నుంచి అందరికీ కొత్త రేషన్ కార్డులు

**సూర్య,కరీంనగర్ రూరల్**

ఎంపిగా బండి సంజయ్ అందరినీ దోచుకొని కోట్లు సంపాదిం చాడని.. ఓటుకు ఇరవై వేలు ఇద్దామని సిద్దమయ్యాడని... ఆయన ఇచ్చే డబ్బు మనదేనని తీసుకొని కారు గుర్తుకు ఓటేయాలని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని ధుబ్బపల్లి, ఫకీర్ పేట, జూబ్లీ నగర్ లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.గ్రామస్థులు గంగులకు డప్పు చప్పుళ్లతో మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్ల మధ్య ఇంటింటికి తిరుగుతూ ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంపీగా గెలిచి నాలుగేళ్లలో బండి సంజయ్ ఒక్క గ్రామానికి వచ్చింది లేదని మళ్ళీ ఎన్నికలు రాగానే మాయమాటలు చెప్పేందుకు వస్తున్నాడని అన్నారు. బీజేపీ కాంగ్రెస్ నాయకులు కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే కనిపిస్తారని వాళ్లకు ఓట్లు వేయించుకొని మాయం అవడం తప్ప తెలిసిందేమీ లేదని అన్నారు. తాను ఎల్లప్పుడూ మీ కళ్ళ ముందే మీ ఆపదలో అండగా ఉన్నానని గుర్తు చేశారు. బీజేపీ కాంగ్రెస్ లు మోసగాళ్ళ పార్టీలని..యాభై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ మన బతుకులు చీకటిమయం చేశాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత కోట్ల రూపాయల నిధులతో గ్రామీణ రహదారులన్నీ పూర్తి చేసి గ్రామాల రూపురేఖలు మార్చాం అని అన్నారు. దుబ్బపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నామని గ్రామంలో దళితులు అందరికీ దళితబంధు అందజేస్తామని, మిగిలిన బీసీ బంధు కూడా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అన్నదాత లను అరిగొస పెట్టి ఆత్మహత్యలకు కారణం అయిన పార్టీ కాంగ్రెస్ అని, బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని అన్నారు. బీజేపీ కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మితే మన పిల్లల భవిష్యత్ అంధకారం అవుతుందని అన్నారు. జనవరి నుంచి అందరికీ కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు అందేజేస్తమని తెలిపారు. పచ్చని తెలంగాణ పై ఆంధ్రోళ్ల కన్ను పడిందని తెలంగాణ ను కాపాడుకోవాల్సిన బాధ్యత మీ చేతుల్లోనే ఉందని అన్నారు. పదేళ్ల కెసిఆర్ అభివృద్ధి పై గ్రామాల్లో చర్చించాలని..మన ఇంటి పార్టీ అయిన బీ ఆర్ ఎస్ కు ఓటు వేసి కెసిఆర్ చేతులను బలోపేతం చేయాలని కోరారు.

# హుజురాబాద్‌కు ఈటల రాజేందర్ చేసిందేమీ లేదు...!?

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని, పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, అక్కడ 500 రూపాయలకే సిలిండర్, కర్ణాటక రాష్ట్రంలో 62 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదని హామీలన్నీ అమలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను కాపీ చేసి పింఛన్లు పెంచేస్తామని టిఆర్ఎస్ ప్రభుత్వం చెప్తుందని, ఉన్న పింఛన్లు సమయానికి ఇవ్వడం లేదు కానీ కొత్త పింఛన్లు ఇస్తామని హామీ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ 400 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. యువకులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సరైన వసతులు లేవని, తనను గెలిపిస్తే హుజురాబాద్ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో డిజిటల్ లైబ్రరీలతో పాటు స్టడీ సెంటర్లను ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తానని హామీ ఇచ్చారు. వేయికోట్ల నిధులతో హుజురాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని మాటలు చెబుతున్నా టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఎవరు ఆపారని అన్నారు. మండలానికో ఇంటర్నేషనల్ స్థాయి పాఠశాల ఏర్పాటు చేసి కార్పొరేట్ స్థాయి విద్యానందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రెండు దశాబ్దాలుగా ప్రజలు ఈటల రాజేందర్ ను గెలిపిస్తూ వస్తున్నారని, ఈ నియోజకవర్గ ప్రజలను కాదని గజ్వేల్ లో పోటీ చేస్తున్నారని తెలిపారు. గజ్వేల్ కు వెళ్లి గజ్వేల్ ముద్దుబిడ్డనని, హుజురాబాద్ కు వచ్చి హుజురాబాద్ బిడ్డనని చెప్తున్నాడని అన్నారు. ఏడుసార్లు అవకాశం ఇచ్చినప్పటికీ ఈ నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉప ఎన్నికల్లో గెలిచి మూడేళ్లు గడుస్తున్న హుజురాబాద్ కు ఏం చేయలేదని, కనీసం తన సొంత మండలమైన కమలాపూర్ మండలంలోని ఉప్పల్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని సైతం పూర్తి చేయలేని పరిస్థితిలో ఈటల రాజేందర్ ఉన్నారని అన్నారు. బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేనని, బిజెపికి ఓటు వేస్తే టిఆర్ఎస్ కు వేసినట్టేనని, టిఆర్ఎస్ కు వేస్తే బిజెపికి వేసినట్లేనని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న హుజురాబాద్ లో రౌడీయిజం పెరిగిపోయిందని అన్నారు. వ్యాపారులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. వ్యాపారులకు స్వేచ్ఛ ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. వ్యాపారాలను అభివృద్ధి చేయడంతో పాటు పరిశ్రమలను తీసుకువచ్చి ఇక్కడ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. వ్యాపారులెవరు అధైర్య పడవద్దని, హుజురాబాద్ నియోజకవర్గంలో గెలిచేది కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు. వ్యాపారులకు అండగా ఉంటూ వారి అభివృద్ధి తో పాటు హుజురాబాద్ ను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాంపూర్ గ్రామంలో హుజురాబాద్ నియోజకవర్గ బిఎస్పి అధ్యక్షుడు బండారి సదానందం, కూరపాటి రామచంద్రం, జూపాక గ్రామంలో వార్డ్ మెంబర్లు తాళ్లపల్లి రాజేందర్, పంజాల సురేందర్, తాళ్లపల్లి ఎల్లయ్య, మునిగాల కరుణ ఆనందం, బోనగిరి కవిత రమేష్, బొత్తలపల్లి గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ సర్పంచ్ సుంకరి స్వరూప చొక్కారెడ్డి లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్ సమక్షంలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొల్లూరు కిరణ్, పిసిసి మెంబర్ పత్తి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు తిప్పారపు సంపత్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లూరి రాహుల్, మండల అధ్యక్షురాలు లావణ్య తో పాటు కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రచారంలో అస్వస్థతకు గురైన ఎమ్మెల్సీ కవిత

(మొదటి పేజీ తరువాయి)

కార్నర్ సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ ప్రసంగిస్తుండగా ఎమ్మెల్సీ కవిత అస్వస్థతకు గురై ప్రచార రథంలో కింద కూర్చున్నారు.దీంతో పక్కనే ఉన్న నాయకులు,సిబ్బంది గమనించి వెంటనే కవితకు శీతల పానీయాలు అందజేసారు.కాసేపటికి తేరుకున్న ఆమె మళ్ళీ తన వాగ్ధాటితో కార్యకర్తల్లో,నాయకుల్లో ఉత్సాహాన్ని నింపుతూ ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తూ,ప్రతిపక్ష పార్టీల నాయకుల పై విమర్శలు గుప్పిన్చారు.అనంతరం గ్రామంలోనే అరగంటసేపు విశ్రాంతి తీసుకొని మండలంలో మళ్లీ ప్రచార పర్వాన్ని కవిత నిర్వహించారు.

## ఆదరించి ఆశీర్వదిస్తే మీ సేవకుడిలా పని చేస్తా

**బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్**

(మొదటి పేజీ తరువాయి)

పథకాలు ఆగలేదని, ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి చేశామని అన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి, నాలుగేండ్లు అవకాశం వస్తే తాను చేసిన అభివృద్ధిపై ఆలోచన చేయాలన్నారు.ఐదేండ్లుఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఏమీ చేయకుండానే మళ్లీ ఓట్ల కోసం గ్రామాలకు వస్తున్నారని, ఓట్లు వేస్తే మళ్లీ ఏం చేస్తారని ఈప్రాంత ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికలు రాంగానే ప్రజలకు అబద్దాలు చెప్పి అధికారం చేజిక్కించుకోవాలని ఆరాటపడు తున్నారని ఆయన విమర్శించారు. గతంలో అనేక హామీలు, అబద్దాలుచెప్పి ఓట్లు వేయించుకుని అదికారంలోకి రాగానే మా ప్రభుత్వం లేదన్నోళ్లు మళ్లీ ఏం చేస్తారని ఆయన ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీ లేని పథకాలతో ముందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులు రోజుకో వేషం వేస్తున్నారని, ఈనాడు మళ్లీ 413పేజీల బుక్‌ను తీసుకువచ్చి అన్నీ మేమే చేస్తామంటూ మభ్యపెడుతున్నారని, 413పేజీల బుక్‌ను ఎవరు చదువుతారని ఆయన అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ అనేక పథకాలను చెప్పకుండానే అమలు చేశారని, చెప్పేవి తక్కువ చేసేవి ఎక్కువగా మా సర్కార్‌తోనే సాధ్యమన్నారు. మారుమూల గ్రామాల్లో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఎంతో మంది పేదల పేరుతో బిల్లులు స్వాహా చేశారని, ఎంతో మంది ఇప్పటి వరకు పూరిగుడిసెల్లోనే ఉంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితులు ఇక ఉండవని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రభుత్వం ద్వారా గృహలక్ష్మి ఇండ్లు మంజూరీ చేయించి ప్రభుత్వం ఇచ్చే మూడు లక్షలతో పాటు తాను కొంత సాయం చేసి ఇండ్లు కట్టిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇలా పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగాలంటే రాష్ట్రంలో, మంథనిలో బీఆర్ఎస్ జెండా ఎగురాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఐదేండ్లలో గుడిసే లేని గ్రామంలా తీర్చిదిద్దుతానని, తాను ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తానే తప్ప ప్రజలను మోసం చేసే మాటలు మాట్లాడనని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో గొప్పగా ఆలోచన చేసి ఓటు వేయాలని, ఈసారి వేసే ఓటు మన బిడ్డల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా ఉండాలని పిలుపునిచ్చారు. నాలుగేండ్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే అభివృద్ధితో పాటు అనేక సేవలు అందించానని, మళ్లీ ఆదరించి ఆశీర్వదిస్తే మీ సేవకుడిలా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

## పోలింగ్ కేంద్రాలలో మౌళిక వసతులను సమీక్షించుకోవాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమెలా సత్పతి**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



జిల్లాలోని అన్ని పోలింగే కేంద్రాలలో కనీస మౌళిక వసతులను కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి సూచించారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమీషనర్లు, యంపిడిఓ లతో పోలింగ్ కేంద్రాలలోని ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమెలా సత్పతి సమీక్షించారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ, పోలింగ్ రోజున జిల్లాలోని 1338 పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు, విద్యుత్ మొదలగు మౌళిక వసతులు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాలలో రాజకీయ పార్టీలకు చెందిన రంగులు వాడకుండ జాగ్రత్తపడాలని, పోల్ చిట్టిల పంపిణి జరిగేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాలలో పంచాయితి సెక్రటరీలు, వ్యవసాయశాఖ ఎఓల సహకారంతో ప్రతిఓటరుకు పొల్ చిట్టిలు అందేలా చర్యలు తీసుకొవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించడంతో పాటు పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, ఎలక్షన్ కోడ్ ముగిసే వరకు అధికారులు, సిబ్బంది ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు .ఈ కార్యక్రమంలొ డిఆర్ఓ పవన్ కుమార్, మున్సపల్ కమీషనర్లు, యంపిడిఓలు పాల్గోన్నారు.

# అభివృద్ధికి నిధులు తేలేదని నిరూపించేందుకు మేము సిద్ధం

## - అమ్మవారి పై ప్రమాణం చేసేందుకు మేము సిద్ధం... నువ్వు సిద్ధమా....

## - బండి సంజయ్ కి నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్లహరిశంకర్ సవాల్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ అభివృద్ధి కోసం రూపాయి తేలేదని నిరూపించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం... తెచ్చానని నువ్వు మహాశక్తి ఆలయంలో అమ్మవారి పై ప్రమాణం చేస్తావా... తేలేదని ప్రమాణం చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నామని బండి సంజయ్ కి నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్లహరిశంకర్ సవాల్ విసిరారు. 37వ డివిజన్ మీసేవ కార్యాలయంలో మీడియా సమావేశంలో నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్లా హరిశంకర్ మాట్లాడుతూ భూకబ్జా చేశాడని ఆరోపిస్తున్న మీరు... ఎక్కడ చేశాడో నిరూపించాలి... లేకపోతే అమ్మవారి ముందు చెంపలు వేసుకుని తప్పు ఒప్పుకోవాలి అని అన్నారు. ఓటమిని అంగీకరిస్తూ మంత్రి గంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. 1991 సంవత్సరం నుండే మంత్రి కుటుంబానికి గ్రానైట్ క్వారీ ఉంది వారి కుటుంబ వ్యాపారమే గ్రానైట్ వ్యాపారం... జిల్లాలో మొత్తం 361 క్వారీలు ఉంటే... గంగుల కుటుంబానిది ఒకటి అని అన్నారు. కరీంనగర్ అభివృద్ధి




చేసినందుకా... కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేసినందుకా... మానేరు రివర్ ఫ్రంట్ తో పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నందుకా... లేక టిటిడి ఇస్కాన్ దేవాలయాలను నిర్మిస్తున్నందుకా.. అని అన్నారు. కరీంనగర్ ప్రజలు బండి సంజయ్ బై బై అంటున్నారని అన్నారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా... పాదయాత్ర పేరుతో కోట్లాది రూపాయల పార్టీ ఫండ్ ను దుర్వినియోగం చేశారని... ఆ పార్టీ అధిష్టానం పదవి నుంచి తొలగించి బయటకు విసిరేశారు. తర్వాత పార్టీ పెద్దల కాళ్ళు పట్టుకుని... జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని తెచ్చుకున్నాడు.. జాతీయ ప్రధాన కార్యదర్శులందరికి ఇంచార్జీలుగా నియమిస్తే... నిన్ను ఎందుకు నియమించలేదో చెప్పాలి అని అన్నారు. సిఎం కెసిఆర్ సభ విజయవంతాన్ని చూసి... ప్రతిపక్ష పార్టీల కళ్ళు బైర్లు కమ్మాయి..ఎన్నికల్లో మంత్రి గంగుల 50 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తున్నారు. మంత్రి గంగుల విజయాన్ని జీర్ణించుకోలేని బండి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బండి సంజయ్ అబద్దాలను నిరూపించేందుకు రేపు టౌన్ బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో మహాశక్తి టెంపుల్ కి వస్తున్నాం.. బండి సంజయ్ అభివృద్ధి కోసం ఒక్క రూపాయి తేలేదని అమ్మవారి పై ప్రమాణం చేసేందుకు మేము సిద్ధం... అభివృద్ధి కోసం నిధులు తెచ్చామని ప్రమాణం చేసేందుకు మీరు సిద్ధమా... మీరు అమ్మవారిపై ప్రమాణం చేయకపోతే ఎల్లుండి నుండి ప్రచారం చేసే అర్హత కోల్పోతారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం ప్రశాంత్ రెడ్డి, షౌకత్, నవాజ్, వాజిద్, సాయి,హరీష్,శ్రీనివాస్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## కోర్కల్ లో బిజెపికి భారీ షాక్

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం కోర్కల్ గ్రామానికి చెందిన బిజెపి నాయకులు, కార్యకర్తలు శనివారం హుజురాబాద్ బిఆర్ఎస్ కార్యాలయంలో హుజురాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. వీరితో పాటు 20 మంది ముస్లిం మైనార్టీ నాయకులు కూడా బిఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి చూసి గతంలో బిఆర్ఎస్ పార్టీలో పనిచేసి బయటకు వెళ్లిన వారంతా తిరిగి మళ్ళీ బిఆర్ఎస్ లోకి వస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర పురోగతి సీఎం కేసీఆర్ తోనే సాధ్యమని అన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ లో చేరిన కోర్కల్ మాజీ సర్పంచ్ కర్ర దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గం అభివృద్ధి కౌశిక్ రెడ్డి తోనే సాధ్యమవుతుందని అన్నారు. హుజురాబాద్ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, శుక్రవారం ఆశీర్వాద సభలో కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ కౌశిక్ రెడ్డికి గొప్ప ప్రాధాన్యమిచ్చారని, హుజురాబాద్ అభివృద్ధిలో సీఎం కేసీఆర్ పాలుపంచుకుంటారని అనడంతో బిఆర్ఎస్ పార్టీ తోనే నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందని నమ్మకంతో పార్టీలో చేరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి, కోర్కల్ గ్రామ సర్పంచ్ మర్రి స్వామి, ఎంపీటీసీ సమ్మయ్య, గ్రామ అధ్యక్షుడు రాకేష్, నరసింగపల్లి సర్పంచ్ కోమల్ రెడ్డి, నాయకులు తంబాల సమ్మయ్య, శంకర్, బాసుమియా, మునీర్, అంకూస్ తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయండి

### బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు: జీవి రామకృష్ణారావు

**సూర్య - మానకొండూర్ :**

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు మానకొండూరు నియోజకవర్గం ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని నియోజకవర్గ ప్రజలకు కార్యకర్తలకు నాయకులకు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సుడా చైర్మన్ జివి రామకృష్ణారావు పిలుపునిచ్చారు. ఈ నెల 20 వ తేదీన తిమ్మాపూర్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో బహిరంగ సభా ఏర్పాటు చేసినట్లు ఆయన మానకొండూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా జీవిఆర్ మాట్లాడుతూ సుమారు 50 వేల మంది కేసీఅర్ ప్రజా ఆశీర్వాద సభకు తరలివస్తున్నట్లు తెలిపారు. మూడోసారి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గెలుపు సులభం చేయడానికి కెసిఆర్ సభ నిర్వహించడం జరిగిందన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో కాళేశ్వరం జలాలతో పొలాలు పచ్చగా మారడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నాని తెలిపారు. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వస్తే తెలంగాణలో అమలు చేయబోయే సంక్షేమ పథకాలు సీఎం కేసీఆర్ సభలో వివరిస్తారని తెలిపారు. వ్యవసాయం పట్ల అవగాహన లేని పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతుల పట్ల ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే నట్టేట ముంచుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి తాళ్లపల్లి శేఖర్ గౌడ్ సర్పంచులు దేవ సతీష్ రెడ్డి రొడ్డ పృధ్విరాజ్, రామంచ గోపాల్ రెడ్డి,నాయకులు పిట్టల మధు, సామంతుల శ్రీనివాస్, పిండి సందీప్, రమేష్, తదితరులు పాల్గొన్నారు..



## బిజెపి లీగల్ సెల్ విస్తృత ప్రచారం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

భారతీయ జనతా పార్టీ కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ గెలుపు కోసం బిజెపి లీగల్ సెల్ అధ్యక్షులు శ్రవణ్ ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం కరీంనగర్ ని పలు ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు . జరగబోయే ఎన్నికల్లో బండి సంజయ్ గెలుపు కోసం బిజెపి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు సభ్యులుగా ఎంపీ బండి సంజయ్ కుమార్ వేలకోట్ల అభివృద్ధి పనులు చేపట్టారాని , ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతరం ఆలోచన చేసే గొప్ప నాయకుడు బండి సంజయ్ కుమార్ అన్నారు. జరగబోయే ఎన్నికల్లో ధర్మ రక్షకుడు, కార్యసాధకుడు బండి సంజయ్ కుమార్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ల్యాండ్ మాఫియా , కబ్జాదారులు , రౌడీ షీటర్ల కు ఈ ఎన్నికల్లో ప్రజలంతా తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మూడుసార్లు ఒక్కరికే కరీంనగర్ ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఆయన, అనుచరుల దౌర్జన్యాలు అక్రమాలు మితిమీరిపోయాయన్నారు. అందుకే కరీంనగర్ ప్రజలంతా ఈ ఎన్నికల్లో బిజెపికి మద్దతు ఇచ్చి, కవలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. లీగల్సెల్ జిల్లా కన్వీనర్ కటకం శ్రవణ్ కుమార్,కో కన్వీనర్ కొలిపాక చంద్రమౌళి, లీగల్సేల్ న్యాయవాదులు పాల్గొన్నారు.



## బిజెపి, బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి చేరికలు

**సూర్య, వీణవంక**

వీణవంక మండలం కొండపాక గ్రామానికి చెందిన సుమారు 20 మంది బిజెపి, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు హుజురా బాద్ నియోజకవర్గ కాంగ్రె స్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ప్రణవ్ గెలుపునకు పని చేయుటకు అహర్నిశలు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ లోకి చేరిన వారిలో బిఆర్ఎస్ నుండి వడ్లకొండ మల్లయ్య, మ్యాడగొని శ్రీనివాస్, గట్టు రాజు, గుర్రం రాజు, బిజెపి నుండి గట్టు ఐలయ్య, కత్తి నాగరాజు, కాటు అజయ్, మ్యాడగొని స్వామి, గుర్రం నారాయణ, గుర్రం సంపత్, మ్యాడగొని రాకేష్ లతో పాటు 20 మంది కార్యకర్తలు చేరారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమాని అన్నారు. రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొని రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొండపాక గ్రామ అధ్యక్షులు తోడేటి రంజీత్, మండల ఎస్సి నాయకులు ఈదునూరి పైడి కుమార్, ఎండీ సాహెబ్ హుస్సేన్, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చదువు జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల ఇంటింటా ప్రచారం

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రణవ్ బాబు ను గెలిపించాలని కోరుతూ శనివారం హుజురాబాద్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను గురించి వారు వివరించారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రంలో పేద ప్రజలకు మంచి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పాల రఘుపతి, ఎండి. తౌసిఫ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





## దుర్శేడ్ లో గంగుల కమలాకర్ కు మద్దతుగా ప్రచారం

**సూర్య,కరీంనగర్ రూరల్**

మండలంలోని దుర్శేడ్ గ్రామంలో గంగుల కమలాకర్ కుమారుడు గంగుల హరిహరన్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ అభ్యర్థి,మంత్రి గంగుల కమలాకర్ కు మద్దతుగా శనివారం జోరుగా ప్రచారం నిర్వహించారు, బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ, మ్యానిఫెస్టో కరపత్రాలు అందజేస్తూ ప్రచారం నిర్వహించారు. గంగుల కమలాకర్ కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు, ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు, గ్రామ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్ రావు గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీరామోజు తిరుపతి, యూత్ మండల అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ ,బి ఆర్ ఎస్ నాయకులు గుండేటి కుమార్, గాజుల హరికృష్ణ, నేత శ్రీధర్ గోలే సంతోష్ .తోట తిరుపతి కోర్కంటి వేణుమాధవ్ రావు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల ప్రచారం

**సూర్య, వీణవంక**

ప్రతీ నోటా కాంగ్రెస్ మాట వినిపిస్తుందని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రణవ్ బాబు గెలవడం ఖాయమని ఎంపిటిసి జీడి దేవేందర్ పేర్కొన్నారు. వీణవంక మండలం వల్భాపూర్ గ్రామంలో ఎంపిటిసి జీడి దేవేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అన్నీ వర్గాల ప్రజలకు పెద్దపీట వేసే విధంగా సామాన్య ప్రజానీకానికి, మహిళా లోకానికి, విద్యార్థి యువ లోకానికి, వృద్దులకు ప్రాదాన్యతను ఇచ్చి 6 గ్యారంటీలను ప్రవేశ పెట్టిందని ప్రజలందరికీ వివరించారు. తెలంగాణ అభివృద్ధి జరుగాలంటే, తెలంగాణ క్షేమంగా ఉండాలంటే తెచ్చుకున్న తెలంగాణ, తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ చేతిలో ఉంటేనే తెలంగాణ గౌరవంగా ఉంటుందని అందుకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సౌమ్యుడు, ప్రజా సేవే ధ్యేయంగా మన ముందుకు వస్తున్న వొడితల ప్రణవ్ ని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని కోరారు. ఈ కార్యాక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పల్లవేని గట్టయ్య, బావు రాకేష్, రాజ్ కుమార్, సిద్దు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మంత్రి కొప్పులకే మా మద్దతు

## గౌడ కులస్తుల తీర్మానం

**సూర్య వెల్గటూర్**

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ ధర్మపురి నియోజకవర్గ అభ్యర్థి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓట్లు వేసి కొప్పుల ఈశ్వర్ కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు గౌడ కులస్తుల సంఘ సభ్యులు ప్రకటిస్తు మంత్రి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గౌడ కులాస్తులు కొనుగోలు చేసిన స్థలంలో మినీ పంక్షన్ హాల్ నిర్మాణం తొ పాటు కాళేశ్వరం లింక్-2 లో చెట్లు కోల్పోయిన వారికి జీవనోపాధి కల్పించాలని మంత్రిని



కోరగా. మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ. పంక్షన్ హాల్ నిర్మాణానికి నిధులు సమకూరుస్తుమని హామీ ఇచ్చారు. అలాగే లింక్ 2లో చెట్లు కొల్పియిన వారి జీవనోపాధి కోసం ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి బి సుధారాణి రామస్వామి, గౌడ సంఘం అధ్యక్షుడు బందెల నర్సయ్య, ఉపాధ్యక్షుడు బుర్రగడ్డ సంతోష్,పట్టణ శాఖ అధ్యక్షుడు రంగు తిరుపతి గౌడ్,గంధ్ర నర్సింగ రావు,పోనుగోటి రామ్మోహన్ రావు,గంధ్ర రాంచెందర్ రావు, గంధ్ర విష్ణు వర్ధన్ రావు,బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చల్లురి రాంచెందర్ గౌడ్,ఉపాధ్యక్షుడు గుండ జగదీశ్వర్,ఎస్సి సెల్ అధ్యక్షుడు కొప్పుల సురేష్, బందెల పెద్ద రాజయ్య గౌడ్,రంగు లసుమయ్య గౌడ్, బందెల లక్ష్మిరాజం గౌడ్, గడ్డం సత్యనారాయణ గౌడ్, సింగం శ్రీనివాస్ గౌడ్,బందెల రాజయ్య గౌడ్, రంగు రాజయ్య గౌడ్,బందెల సతీష్ గౌడ్,బుర్ర చిలుకలయ్య గౌడ్,తో పాటు మహిళలు తదితరులు పాల్గొన్నారు.




## మంత్రి కొప్పులకే వికలాంగుల మద్దతు..

**బీఆర్ఎస్ కే ఓటు వేస్తామని ఏకగ్రీవ తీర్మానం...**

**సూర్య వెల్గటూర్**



ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్ కే మా మద్దతు అని తెలంగాణ దివ్యంగుల నెట్ వర్క్ రాష్ట్ర కో ఆర్డినేటర్ బండి సత్యనారాయణ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓట్లేసి ఈశ్వర్ కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వికలాంగుల రాష్ట్ర నెట్ వర్క్ కో ఆర్డినేటర్ బండి సత్యనారాయణ వికలాంగులు సంఘం ప్రతినిధులు ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. వికలాంగులం అంత కలిసి కట్టుగా కారు గుర్తుకు ఓట్లేసి మరోసారి గెలిపించు కుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి,వెల్గటూర్,ఎండపల్లి మండలాల అధ్యక్షులు ముతూనూరి మహేష్,బండమీది నరేశ్,దేవి నాగేందర్,కందికట్ల సత్యనారాయణ, జక్కుల మల్లయ్య,ఎడ్ల శంకరయ్య, జెల్లా లావణ్య,పిస్క వెంకవ్వ, గసికంటి శ్రీకాంత్, మారంపల్లి సత్తయ్య, బండారి రమేష్,గాజుల అనిల్,రెబ్బస్ పోచయ్య,గొడిశెల రాజేశం,ఎంబడి సతీష్,బెదిగం రాజు తో పాటు నియోజకవర్గ వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొప్పుల మళ్ళీ గెలవాలని యువత పాదయాత్ర

**జెండాఊపి పాదయాత్ర ప్రారంభించిన ఏఎంసి చైర్మన్..**

**సూర్య వెల్గటూర్**



కొప్పుల ఈశ్వర్ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మల్లి భారీ మెజారిటీతో గెలుపొందాలని జగిత్యాల జిల్లా ఉమ్మడి మండలాల యూత్ అధ్యక్షుడు బిడారి తిరుపతి ఆధ్వర్య ంలో కిష్టనావుపేట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం నుండి కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయం వరకు శనివారం భారీ ఎత్తున పాదయాత్ర ప్రారంభించారు. అంతకుముందు పాదయాత్ర ను వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పత్తిపాక వెంకటేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఉమ్మడి మండలాల నుండి భారీగా తరలివచ్చిన యువత డీజే చప్పుళ్ళతో దేకీలెంగే...థేకిలెంగే అంటూ స్టెప్పులు వేస్తూ 8 కిలోమీటర్ల మేర సుమారు వెయ్యికి పై చిలుకు యువత పాదయాత్ర గా కోటిలింగాల వరకు వెళ్లి కొప్పుల ఈశ్వర్ భారీ మెజారిటీతో గెలుపొందాలని శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామికి ముడుపు కట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడుతూ అహర్నిశలు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నా కొప్పుల ఈశ్వర్ మరోసారి భారీ మెజారిటీతో గెలుస్తున్నారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలు యూత్ సంఘాల సభ్యులు, సర్పంచ్ లు ,ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి సమక్షంలో మహిళలు భారీగా బిఆర్ఎస్ లో చేరికలు..

**సూర్య వెల్గటూర్**



గ్రామాల అభివృద్ధి ఆకాంక్షించి వివిధ పార్టీలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కప్పరావుపేట గ్రామానికి చెందిన పలు సంఘాల సంబంధించిన సుమారు 100 మందికి పైగా మహిళలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అభివృద్ధి పనులను సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి కొప్పుల ఈశ్వర్ చేస్తున్న కృషిని చూసి పార్టీలో చేరుతున్నట్టు వారు తెలిపారు. మరోసారి మంత్రి కొప్పుల ఈశ్వర్ ను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

**సూర్య,మెట్ పల్లి**



పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులో పోలీసుల తనిఖీలలో అక్రమంగా తరలిస్తున్న మధ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల నిబంధనలలో భాగంగా వాహనాలను చెకింగ్ చేస్తుండగా అరవై లీటర్ల మద్యం దొరికినట్లు, మద్యం విలువ ఇరవై వేల ఐదువందలా రూపాయలు గా ఉంటుందని, దొరికినా మద్యం ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## వెల్డింగ్ సంఘం నూతన అధ్యక్షుడిగా సల్మాన్

**సూర్య, మెట్ పల్లి**



పట్టణ వెల్డింగ్ షాప్ సంఘం ఎన్నికలలో నూతన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మహమ్మద్ సల్మాన్ ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సంఘ గౌరవ అధ్యక్షులు కంబ నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ క్యాషియర్ ముస్తక్ లను ఎన్నుకున్నారు. ఈ సంధర్భంగా అదక్షుడు మాట్లాడుతూ సంఘ అభివృద్ధి కోసం తను ఎల్లపుడూ పాటుపడతామని సల్మాన్ ఖాన్ అన్నారు. అనంతరం సంఘ సభ్యులు సల్మాన్ ఖాన్ సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## సంజయ్ గెలుపే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నా దారిశెట్టి రాజేష్

**సూర్య కోరుట్ల రూరల్**



ఎన్నికల సమయం దగ్గర పడడంతో కోరుట్ల నియోజకవర్గం బి ఆర్ ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గెలుపే లక్ష్యంగా మండలంలోని మాదాపూర్ గ్రామంలో గడపగడపకు ప్రచారం ముమ్మరం చేసిన మాదాపూర్ గ్రామ సర్పంచ్ దారిశెట్టి రాజేష్. జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య రాజేష్ లు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ని అధిక మెజారిటీతో గెలిపించుకుందామని ఆయన కోరారు. ప్రచారంలో వీరి వెంట ,ఎంపిటిసి చేపూరి కృష్ణారెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు గడ్డం మల్లారెడ్డి , %ౌూజూ% చైర్మన్ గడ్డం ఆది రెడ్డి, వైస్ చైర్మన్ పడాల లచ్చన్న, యూత్ అధ్యక్షుడు కొండ శీను, మండల బి ఆర్ ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, పాల్గొనడం జరిగింది.

## గడపగడపకు ఎన్నికల ప్రచారం

**సూర్య -కోరుట్ల**



ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కోరుట్ల పట్టణంలోని 12వ వార్డులో బి ఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్లసంజయ్ సతీమణికల్వకుంట్ల దీప్తి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఏ గడప కెళ్ళిన కేసీఆర్ చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేస్తూ తెలంగాణ అభివృద్ధిలో భాగంగా అందరు కూడా సహకరించాలని కోరడం జరిగింది. దీనికి ప్రజల నుండి అనూహ్యస్పందన వస్తూ నియోజకవర్గంలో విద్య, వైద్యరంగంలో సేవలందిస్తున్న కల్వకుంట్లసంజయ్ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆమె వెంట కౌన్సిలర్ ఆడేపు కమల మధు, గంధ్ర శిల్ప రావు , మహిళలు, బిఆర్ఎస్ నాయకులు ,యువజన నాయకులు తదితరులు ఉన్నారు.

## కౌంటింగ్ సెంటర్లో ఏర్పాట్లని పూర్తి చేయండి.

**జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

శాసనసభ ఎన్నికల అనంతరం డిసెంబర్ మూడో తేదీన జరుగు ఓట్ల లెక్కింపు కై సంబధిత కేంద్రంలో ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం రోజున నూకపల్లి లోని డా. విఆర్.కే. కళాశాల లో అదనపు కలెక్టర్ తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు సందర్భంగా %జతీఎ% కళాశాలలో ఏర్పాట్లను ఈ నెల 28 లోగా పూర్తిచేయాలని, పోలింగ్ తర్వాత ఈవిఎం లెక్కింపు కేంద్రాలలో భద్రపరచడం జరుగుతుందని, ఆ లోపల లెక్కింపు కేంద్రాలలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పనులు సకాలంలో పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్.లత, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డి.ఎస్.పి. వెంకట స్వామి, పంచాయతీ రాజ్ ఈఈ రహమాన్, మునిసిపల్ కమిషనర్ అనీల్ కుమార్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**సూర్య మల్లాపూర్**



మండలంలోని మొగిలిపేట్ గ్రామానికి చెందిన దండవేని ధర్మరాజు (43) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. ధర్మరాజు గత కొంతకాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతూ హాస్పిటల్లో చికిత్స తీసుకున్నప్పటికీ ఎంతకీ ఆరోగ్యం కుదుట పడలేదు. దీంతో మనస్తాపం చెంది ఇంటి పక్కనే గల కొట్టంలో శుక్రవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య దండవేని పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

**సూర్య జగిత్యాల**

జగిత్యాల పట్టణంలోని కృష్ణానగర్ లో గల తక్షిలా స్కూల్ లో శనివారం చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రత్యేక అలంకరణలతో చేసిన నృత్యాల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఫస్ట్ క్లాస్ చిన్నారులు చేసిన నృత్యానికి పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కేరింతలు కొట్టారు. ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులను అభినందించారు.

## బిజెపి కి రాజీనామా చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

**సూర్య, మెట్ పల్లి టౌన్**



రాష్ట్ర పద్మశాలి సంఘం నాయకుడు, మెట్ పల్లి మాజీ సర్పంచ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాంబార్ ప్రభాకర్ బిజెపి పార్టీకి రాజీనామా చేసినట్లు శనివారం పత్రిక విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ ధర్మపురి అరవింద్ తనకూ ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని చెప్పి ఆశకు గురిచేసి నన్ను వారి స్వార్థానికి వాడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోరుట్ల నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న పద్మశాలీల మద్దతును బిజెపి పార్టీకి అందించాలని పద్మశాలిల యుద్ధభేరిని తన భుజస్కందాలపై మోసానని, ఎన్ని అవమానాలు జరిగిన తాను బాధపడలేదని అన్నారు. పద్మశాలీల సభ విజయవంతం కావడంతో, బిజెపికి ఎంతో ఓటు బలం చేకూరిందని, నన్ను ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెడతానని ఇచ్చిన మాటను తప్పి, తానే ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి రావడం విచారం ఇ.లాంటి మోసపూరిత వ్యక్తితో కలిసి పని చేయడం ఇష్టం లేక బిజెపి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సాంబారి ప్రభాకర్ తెలిపారు. పద్మశాలి సంఘ సభ్యులతో చర్చించి తర్వాత వారి నిర్ణయాన్ని తెలియపరుస్తామన్నారు. ఈ సమావేశంలో పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.




## మేలు చేసేటోడు కావాల్నో..
# కిందమీద జేసేటోడు కావాల్నో తేల్చుకోండి
### -రామగుండం ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్

**సూర్య-గోదావరిఖని:**

మనకు మేలు చేసేటోడు కావాల్నో.. కిందమీద జేసేటోడు కావాల్నో మీరే తేల్చుకోండి.. మీరు ఆలోచించకుండ ఓటేస్తే ఆగమైతరు.. అప్పుడు నేను గూడా ఏం జేయలేను.. పదేళ్లుగా మేం పడ్డ కష్టం బూడిదల పోసిన పన్నీరయితదని రామగుండం ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఇక్కడి సింగరేణి సంస్థకు చెందిన జిడికె-2వ బొగ్గుగని వద్ద కార్మికులను కలుసుకొని మాట్లాడారు. విజ్ఞులైన సింగరేణి కార్మికులు ఎవరిని గెలిపిస్తే రాష్ట్రం, సింగరేణి సంస్థ బాగుపడుతదో చూసి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణియులకు అండగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నారని, కార్మికుల వారసులకు ఉద్యోగాలు కల్పించింది తెలంగాణ ప్రభుత్వం అనే విషయాన్ని మరిచిపోవద్దని కోరారు. రాష్ట్రంలో ప్రజలందరూ ఒక తాటిపైకి వచ్చి బీఆర్ఎస్



పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలనే దృఢ సంకల్పంతో ఉన్నారని, రామగుండం నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీసేందుకు.. ప్రతిపక్ష పార్టీలు కుట్రలకు తెర లేపుతున్నారని, సింగరేణి యాజమాన్యం ఎలక్షన్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ పేరిట కార్మికులను కలవకుండా చేయడం చాలా దుర్మార్గమని అన్నారు. ఇప్పటివరకు ఈ ప్రాంతంలోని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిలబడి కొట్లాడి పోరాటం చేశామని చందర్ గుర్తు చేశారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని వివరించారు. గతంలో కార్మిక హక్కులను కాలరాసిన జాతీయ కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్ టియుసి కాంగ్రెస్ పార్టీ పంచన చేరాయని, వారికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరగాలంటే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలపై ఉందని చందర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్ కుమార్, టీబీజీకేస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్య, గండ్ర దామోదర్ రావు, జావిద్ పాష, కనకం శ్యామ్ సన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వాహణకు ప్రత్యేక ఏర్పాట్లు..
### గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస రావు

**సూర్య మంథని**



ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వాహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస రావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంథని పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రా వాహనంతో పాటు సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులతో మంథని పోలీసులు కవాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి అంబేద్కర్ చౌక్‌తో పాటు ప్రధాన చౌరస్తాల మీదుగా పోలీసులు వజ్రా వాహనం శబ్ధాన్ని వినిపిస్తూ కవాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంథని, గోదావరిఖని, రామగుండం సీఐలు సతీష్, ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు, వేణుగోపాల్, అబ్దుల్‌లోద్దిన్, చంద్రశేఖర్, ఎస్ఐలు సిహెచ్ కిరణ్‌కుమార్, మధుసుధన్ రావు, హరిప్రసాద్, రాములు, జీవన్, సంతోష్, వెంకట్‌లతో పాటు పలువురు ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి
### -జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు కలెక్టర్ శ్రీధర్

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

శాసనసభ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని స్థానిక అధికారులకు జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి, గంగారం ,శ్రీరాంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు శ్రీధర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని, ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు బాధ్యతాయుతంగా



వ్యవహరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి పని చేయాలని ఉల్లంఘించిన వారిపై భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ ల పరిధిలో ఓటర్ స్లిప్పులను ఓటర్లందరికి పంపిణీ జరిగేలా చూడాలన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో పూర్తి నిరంతర తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులను తిరిగి పరిశీలించుకోవాలన్నారు. మహిళలు, దివ్యాంగులు, యువత కోసం మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట అధికారులు స్థానిక తహసిల్దార్ జాహెద్ పాషా, సుల్తానాబాద్ సిఐ జగదీష్, కాల్వ శ్రీరాంపూర్ ఎస్సై శ్రీనివాస్ సిబ్బంది తదితరులున్నారు.

## కవితక్క సభ స్థలం ను పరిశీలించిన ఏసీపీ తుల

**సూర్య, సెంటినరీ కాలనీ**



సెంటినరీ కాలనీ వాణి సెకండరీ పాఠశాల గ్రౌండ్ ను శనివారం గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ నెల ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్సీ, టీబీజీకేస్ యూనియన్ గౌరవాధ్యక్షురాలు కవితక్క, మంథని బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకర్ కు మద్దతుగా ప్రచారానికి వస్తున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ రావు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈయన వెంట మంథని సీఐ గడికొప్పుల సతీష్, రామగిరి ఎస్సై కటికే రవి ప్రసాద్, పురుషోత్తం దివ్య తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి ఎస్.జీ.ఎఫ్ క్రికెట్ పోటీల ఎంపిక

**సూర్య, సెంటినరీ కాలనీ**

పెద్దపల్లి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జీ.ఎఫ్) క్రికెట్ పోటీల క్రీడాకారుల సెలక్షన్ శనివారం సెంటినరీ కాలనీ జేఎన్టీయూ కళాశాల గ్రౌండ్ లో నిర్వహించారు. అండర్-14,అండర్-17 విద్యార్థులను సెలక్షన్ చేసినట్లు పెద్దపల్లి జిల్లా ఎస్.జీ.ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. ఈ ఎంపికలో జిల్లా నుండి 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సెలక్షన్ పోటీలు పెద్దపెల్లి జిల్లా డివైఎస్ఓ ఏ.సురేష్, జె.ఎన్.టి.యు కళాశాల పీ.డీ పింగిలి.కృష్ణారెడ్డి, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి వేల్పుల సురేందర్ సమక్షంలో జరిగాయి. సెంటినరీ కాలనీ జేఎన్టీయూ కళాశాల గ్రౌండ్ లో ఈనెల 24న అండర్-17, 27న అండర్-14 జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

## ఓటరు స్లిప్ ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్

**సూర్య, చొప్పదండి**

రాష్ట్ర సాధారణ ఎన్నికలకు సంబందించిన పోలింగ్ స్లిప్ ల పంపిణీ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ ప్రారంభించారు.పట్టణంలోని 18 పోలింగ్ కేంద్రాలలో సంబంధిత బిఎల్ఓ ల ద్వారా ఓటర్లకు పోలింగ్ స్లిప్ప, గుర్తింపు కార్డులు పంపిణీ చేయనున్నారు.ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటర్ల కు ఎటువంటి అవంతరాలు లేకుండా ఇంటి వద్దకే పోలింగ్ స్లిప్ లు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజలు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకొని పోలింగ్ శాతాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు..

# టూరిస్టు నాయకులను నమ్మితే మోసపోతం..
## మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజా

**సూర్య మంథని**

ఐదేండ్లకోసారి ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే టూరిస్టు నాయకులను నమ్మితే మోసపోతమని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బాగంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ ఓటు వేసి ఆశీర్వదించాలని కోరుతూ మంథని పరిధిలోని కూచురాజుపల్లి శ్రీరాంనగర్ ఐదో వార్డు సభ్యులు నక్క నాగేంద్ర శంకర్ ఆధ్వర్యంలో పుట్ట శైలజకు ఘన స్వాగతం పలికారు ప్రతి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. వార్డులోని ప్రతి గడపగడపకు తిరుగుతూ మహిళలకు బొట్టుపెడుతూ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిపెస్టోతో పాటు పుట్ట లింగమ్మ ట్రస్టు ద్వారా చేసిన సేవలను వివరించారు. ఈసందర్బంగా మాట్లాడుతూ తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు ఆలోచన చేయాలని అన్నారు. ఎన్నికలు రాగానే వచ్చే



కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికలు అయిపోయాక మళ్లీ ఐదేండ్ల వరకు కన్పించరని అన్నారు. ఓట్ల కోసం గ్యారెంటీలేని పథకాలు చెప్తున్నారని, వాళ్ల మాటలు నమ్మితే కర్ణాటక తరహాలో గోసపడుతామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న పుట్ట మధూకర్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నాలుగేండ్లలో మంథని అభివృద్ధితో పాటు ఈ ప్రాంత ప్రజలకు అనేకసేవలు అందించారని ఆమె గుర్తు చేశారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లు, పేద విద్యార్థులకు కళాశాలల్లో మధ్యాహ్న బోజనం పెట్టి ఆకలి తీర్చిన విషయాలను గుర్తించాలన్నారు. గత ఎన్నికల్లో మనం ఓట్లు వేసి గెలిపించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఐదేండ్లలో ఏం చేసిండని ఆలోచించాలని, ఒక్కరికైనా సాయం చేసిండా అని ఆమె ప్రశ్నించారు. ఏమీ చేయనోళ్లకు మళ్లా ఐదేండ్లు అదికారం ఎందుకని ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఆనాటి నుంచిఈనాటి వరకు మన కోసం మన బిడ్డల భవిష్యత్ కోసం ఆలోచన చేసే నాయకుడు పుట్ట మధూకర్ అని, పుట్ట మధూకర్ ఎమ్మెల్యేగా గెలిస్తే ఎన్నో కుటుంబాలకు భరోసా ఉంటుందన్నారు. మనకు మన బిడ్డల కోసం ఆరాటపడే పుట్ట మధూకర్‌ను ఆదరించి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ప్రచార కమిటీ కార్యదర్శి ఉప్పల భాగ్యలక్ష్మి పుట్ట పద్మ భక్తుల విజయలక్ష్మి సత్యనారాయణ బుద్యార్థి రాణి బి ఆర్ఎస్ నాయకులు ఎమ్మెస్ రెడ్డి అంబటి నర్సింగ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# బిడ్డా నేను నోరు విప్పితే మీరు బిస్తర్ సర్దుకోవాల్సిందే

## - అవినీతి పరుడెవరో తేల్చుకుందామా - బీజేపి అభ్యర్థి బండి సంజయ్ కుమార్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

బిడ్డా నేను నోరు విప్పితే మీరు బిస్తర్ సర్దుకోవాల్సిందేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ముస్లిం ఓట్ల కోసం సిగ్గులేకుండా టోపీ పెట్టుకుని మసీదుల్లోకి వెళ్లి నమాజ్ చేస్తున్న గంగుల, కేసీఆర్ లు నిజమైన హిందువులైతే ఒవైసీ సోదరులను హనుమాన్ ఆలయానికి తీసుకొచ్చి స్వచ్ఛందంగా బొట్టుపెట్టుకుని హనుమాన్ చాలీసా చదివించే



దమ్ముందా?" అంటూ సవాల్ విసిరారు. తనను అవినీతిపరుడినంటూ గంగుల చేసిన ఆరోపణలపైనా బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. "బిడ్డా నన్ను అవినీతిపరుడని అంటున్నావ్ నేనెటువంటి వాడినో కరీంనర్ ప్రజలందరికీ తెలుసు. నేను కనుక నోరు విప్పితే నువ్వు, కేసీఆర్ బిస్తర్ సర్దుకుని రాష్ట్రం విడిచిపోతారు జాగ్రత్త" అంటూ వార్నింగ్ ఇచ్చారు. "గంగుల కమలాకర్ నేను వందల కోట్లు సంపాదించానన్నవ్ కదా నీకు దమ్ముంటే నా ఆస్తిపాస్తులు, డబ్బుసంచులన్నీ చూపియ్.. అట్లాగే నాకున్న ఆస్తిపాస్తులన్నీ ప్రజల ముందుంచుతా నేను కోట్లు సంపాదించినట్లు నిరూపిస్తే అవన్నీ కరీంనగర్ ప్రజలకే రాసిస్తా అదే విధంగా అవినీతి, అక్రమాలతో నువ్వు సంపాదించిన ఆస్తిపాస్తులు, డబ్బు సంచుల వివరాలన్నీ నేను ప్రజల ముందుంచుతా కరీంనగర్ ప్రజలకు పంచి ఇచ్చేందుకు సిద్ధమా?" అంటూ సవాల్



విసిరారు. ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద బండి సంజయ్ మాట్లాడుతూ గంగుల కమలాకర్ నువ్వు కేసీఆర్ ను ఒప్పించి ఎన్ని నిధులు తీసుకొచ్చావో చెప్పు నేను కేంద్రంతో మాట్లాడి ఎన్ని నిధులు తీసుకొచ్చానో లెక్కాపత్రంతోసహా వివరించేందుకు సిద్ధం దమ్ముంటే నా సవాల్ ను స్వీకరించాలని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి భూకబ్జాదారుడు. ప్రజల గురించి అతనికి ఏం తెలుసు. కరీంనగర్ గురించి అవగాహనే లేని వ్యక్తికి ఓట్లేస్తే వృథా అయినట్లే మీ విలువైన ఓట్లను పువ్వు గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు.



## బహిరంగ సభ విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు

### - ఎమ్మెల్యే రవిశంకర్

**సూర్య గంగాధర / కరీంనగర్ ప్రతినిధి**

నియోజక వర్గంలో జరిగిన కెసిఆర్ బహిరంగ సభ విజయవంతం చేసిన నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే రవిశంకర్ కృతజ్ఞతలు తెలియజేశారు. గంగాధర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు మేడిపల్లి సత్యం ఆయనపై ఆసత్య ఆరోపణ చేస్తున్నాడని ఆయన ఆరోపించిన ఆరోపణలు గంగాధర చౌరస్తా వద్దకు వచ్చే నిరూపిస్తే తలనరుకుంటానని అన్నారు. పిచ్చిపిచ్చి ఆరోపణలు చేస్తే బాగుండదు అని మేడిపల్లి సత్యంపై అగ్రహారం వ్యక్తం చేశారు.

# బీడు భూములను సాగు భూములుగా తీర్చిదిద్దిన ఘనత కే సిఆర్‌దే

### బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మేడ

**సూర్య - కథలాపూర్**

బీడు భూములను సాగు భూములుగా తీర్చి దిద్దిన ఘనత కే సి ఆర్ ప్రభుత్వం కే దక్కుతుందని బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి చల్మేడ లక్ష్మి నరసింహ రావు అన్నారు. శనివారం మండలంలోని పోసాని పేట, కథలాపూర్, సిరికొండ, పెగ్గెర్ల, ఊటుపల్లి , భూషణ్ రావు పేట, చింత కుంట, రాజారాం తండా లో ఇంటింటా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు, రైతులకు అందిస్తున్న పథకాలను వివరించారు. అభివృద్ధి ని చూసి కారు గుర్తు కు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమ%శీ%లో జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి-గణేష్, వైస్ ఎంపీపీ కిరణ్ రావు, పార్టీ



మండల అధ్యక్షుడు గడీల గంగ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుండారపు సౌజన్య-గంగాధర్, వైస్ చైర్మన్ సోమ దేవేందర్ రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ చుక్కా దేవరాజం, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు కేతిరెడ్డి మహిపాల్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు భూమా రెడ్డి, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు ఎం.జి రెడ్డి, ఎంపిటీసీల ఫోరమ్ మండల అధ్యక్షుడు బొడ్డు బాలు, సర్పంచులు గాండ్ల వీణ-స్వామి, పిడుగు తిరుపతి రెడ్డి, మొలిగే శ్రీనివాస్,గజ్జెల స్వామి, లవుడ్యా సరిత-రవీందర్ నాయక్, ఎంపీటీసీలు మల్యాల రమేష్ గౌడ్, దొప్పల హైమవతి-జెలెందర్, కొండ ఆంజనేయులు, కో-అప్షన్ సభ్యుడు రఫీ, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ నాగేశ్వరరావు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కల్లెడ శంకర్, సీనియర్ నాయకులు చీటి విద్యాసాగర్ రావు, మహేందర్, మామిడిపల్లి రవి, మహిళ నాయకురాలు స్వప్న, ఓసి సెల్ అధ్యక్షుడు హరీష్ రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు నల్ల గంగాధర్ తో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపిటీసీలు, వార్డ్ సభ్యులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

## యాభై క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత.

**సూర్య, ఇల్లంతకుంట**



మండల కేంద్ర పరిధిలోని కూనవేని పల్లే నుండీ అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి. సుధాకర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నతరుణంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై, సిబ్బందితో కలిసి వెళ్లగా అక్కడ వానారాసి శ్రీనివాస్ అనే వ్యక్తి ఒక ట్రాలీ ఆటోటిఎస్ 12%ఖణ% 1924 లో కొన్ని రేషన్ బియ్యం కలిగయుండి అతని ఇంటిలో మరికొన్ని మొత్తం 100 చిన్న సంచులలో దాదాపు 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం కలిగి ఉండడం తో అట్టి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లుచెప్పారు. వనరాసి శ్రీనివాస్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా పెట్టనున్నట్లు తెలిపారు.

## రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలలో భూపతిపూర్ విద్యార్థిని ప్రతిభ

**సూర్య,రాయికల్**

రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలలో రాయికల్ మండలంలోని భూపతిపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రతిభ చాటి తృతీయ స్థానం సాధించింది. సికింద్రాబాద్ లోని ఐ ఐ సి టి ఆడిటోరియంలో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలలో రాయికల్ మండలం భూపతిపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొడ్డుపల్లి రక్షిత తృతీయ స్థానం సాధించి డాక్టర్ రామచంద్ర చేతుల మీదుగా బహుమతి అందుకున్నది. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జ్ఞాన్ ప్రతిష్ట , సిద్ధార్థ యోగ విద్యాలయం మరియు తెలంగాణ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో "మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర" అనే అంశంపై రాష్ట్రస్థాయిలో జరిగిన ఉపన్యాస పోటీలలో రక్షిత ప్రతిభ కనబరిచింది . తృతీయ స్థానంలో నిలిచిన రక్షితకు రూ .6000 నగదు ప్రశంస పత్రం ఇచ్చి సన్మానించారని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు దాసరి రామస్వామి ,చిన్నయ్య తెలిపారు. ప్రతిభ కనబరిచిన రక్షితను జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి,మండల విద్యాధికారి గంగాధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు వి రమణి ,సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, ఎస్ఎంసి చైర్మన్ జక్కుల ప్రసాద్, ఉపాధ్యాయులు సామర్ల గంగాధర్,సిరిపురం మహేష్, సిద్దే గంగరాజం,బోలె చిన్నయ్య,తిరుమల ,శంకరయ్య, కార్తీక్,రాపర్తి నరసయ్య,పిటి బందెల శ్రీనివాస్ అభినందించారు.



# నిరుపేదల బాగోగులే బిఆర్ఎస్ లక్ష్యం

## - హుజురాబాద్ అభివృద్ధిపై కేసీఆర్ శ్రద్ధ - టిఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి

**సూర్య, హుజురాబాద్**

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల బాగోగులే లక్ష్యంగా బిఆర్ఎస్ పని చేస్తుందని సీఎం కేసీఆర్ అట్టడుగు వర్గాల సంక్షేమమే ధ్యేయమనీ, ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని బిఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. శనివారం హుజురాబాద్ నియోజకవర్గంలోని దమ్మక్కపేట, ఇప్పల నర్సింగాపూర్, పెద్ద పాపయ్యపల్లి, చిన్న పాపయ్యపల్లి, కాట్రపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన విస్తృతంగా పర్యటించి ప్రసంగించారు. ఓటర్లను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి మంత్రంగా బిఆర్ఎస్ పార్టీ పని చేస్తుందన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా రైతులకు 24 గంటల ఉచిత కరెంటు తో పాటు రైతుబంధు, రైతు భీమా పథకాలు అమలు చేస్తూ రైతుల గుండెల్లో గుడి కట్టుకున్న మహనీయుడు కేసీఆర్ అన్నారు. తెలంగాణలో ఉన్న పేద ప్రజల బాగోగుల కోసం ఆలోచించి కొత్త మేనిఫెస్టో తయారు చేశారని, మేనిఫెస్టోలో సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు 3000 రూపాయలు అందించడంతో పాటు ఆరోగ్యశ్రీని 15 లక్షల పెంచుతామని అన్నారు. దీంతో పాటు ప్రతి కుటుంబానికి కేసిఆర్ ధీమా ప్రతి ఇంటికి భీమా అనే పథకం తో 5 లక్షల ఉచిత భీమా అందించడంతో పాటు గ్యాస్ సిలిండర్ ని కూడా 400 కి ఇవ్వనున్నామన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి అన్నపూర్ణ పథకం ద్వారా సన్న బియ్యం కూడా అందించనున్నామన్నారు. ఉప ఎన్నికల సమయంలో సెంటిమెంటు డైలాగులతో నియోజకవర్గంలో ఓట్లు వేయించుకొని కనీసం గెలిచిన రెండున్నర సంవత్సరాల కాలంలో ఒక్కసారైనా నియోజకవర్గానికి వచ్చి ప్రజల బాధలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గత ఏడుసార్లు ఇక్కడి ఎమ్మెల్యే ఈటలకు అవకాశం కల్పించిన హుజురాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయాడని అన్నారు. ఏడుసార్లు అవకాశం ఇచ్చిన ఇక్కడి ఎమ్మెల్యే ఈటల చేయని అభివృద్ధిని ఒకే ఒక అవకాశం కల్పిస్తే చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఒకవేళ నేను చెప్పిన విధంగా అభివృద్ధి చేయకుంటే మళ్లీ మీ ముందుకు ఓట్ల కోసం రానని అన్నారు. మూడోసారి కూడా బిఆర్ఎస్ పార్టీనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు వెళ్లి హుజురాబాద్ అభివృద్ధి కోసం 1000 కోట్లు తీసుకువచ్చి హుజురాబాద్ నియోజకవర్గం మరో సిద్ధిపేట తరహాలో అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి మొత్తం బిఆర్ఎస్ తోనే సాధ్యమవుతుందన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే హుజురాబాద్ ను అద్భుతంగా చేస్తానని హామీ



ఇచ్చారు. కొత్త మండలాలతో పాటు 1000కోట్ల రూపాయలు కూడా అడిగితే ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని అన్నారు. అనంతరం హుజురాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల ఇంచార్జ్, మాజీమంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి మాట్లాడుతూ పట్టుదల కలిగిన పాడి కౌశిక్ రెడ్డిని ఈ ఎన్నికల్లో ఆశీర్వదించాలని, హుజురాబాద్ అభివృద్ధి తద్వారా జరుగుతుందని అన్నారు. పాడి కౌశిక్ రెడ్డి సతీమణి శాలిని రెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా హుజురాబాద్ నియోజకవర్గంలో ఉంటూ ప్రజాసేవ చేసుకుంటున్నామని, ఒకసారి మా కష్టాన్ని కూడా గుర్తించాలని, దండం పెట్టి, కొంగు పట్టి అర్ధిస్తున్న ఒక్క అవకాశం ఇవ్వాలంటూ ఆమె కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, రమణారెడ్డి, ఐలయ్య, రజిత, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

## - వేములవాడ రూరల్ సిఐ కృష్ణ కుమార్ - కేంద్ర, జిల్లా పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్

సూర్య బోయిన్ పల్లి

బోయిన్పల్లి మండలంలోని రామన్నపేట, రత్నంపేట, వరద వెల్లి, జగ్గారావుపేట గ్రామాలలో పోలీసులు శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ కృష్ణ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరగనున్న పోలింగ్ కు ప్రజలంతా హాజరై తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు జిల్లా తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అన్ని విధాల చర్యలు



చేపడుతున్నామని అన్నారు.ప్రజలలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే ప్రతి గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ లను నిర్వహించడం జరుగుతుందని అన్నారు.మద్యం,నగదు ఇతర వస్తువుల ద్వారా ఎవరైనా ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఎన్నికల నియమాలు ప్రకారం వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల వేళ సోషల్ మీడియా వేదికగా వర్గాల మధ్య వ్యక్తుల మధ్య అల్లర్లు సృష్టించే వారిపై,సోషల్ మీడియాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా పోస్ట్ లు పెడితే పోస్ట్ చేసే వారిపై గ్రూప్ అడ్మిన్ లపై కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు అవుతాయన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్ లో ఎస్.ఐ శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, బి ఎస్ ఎఫ్, సిబ్బంది పాల్గొన్నారు.



## వాణీనికేతన్ హైస్కూల్ లో స్వయం పరిపాలనదినోత్సవ వేడుకలు

సూర్య.ఇల్లంతకుంట

మండలకేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్ లో శనివారం స్వయం పరిపాలనదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలను భోదించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనిధిలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన చల్మెడ

సూర్య కోనరావుపేట

కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన జేఏసీ అధ్యక్షుడు ఉప్పుల ఆంజనేయులుతో పాటు గ్రామానికి చెందిన ఓద్యారపు శంకర్, దొబ్బల లక్ష్మణ్, ఊరడి కొమురయ్య, ఉప్పుల చిన్న ఆంజనేయులు, బొల్లు రాములు, దాది మల్లేశం బొడ్డు రమేష్ లు శనివారం బి.ఆర్.ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావు సమక్షంలో బి.ఆర్.ఎస్ పార్టీలో చేరారు. వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, గ్రామ ఎంపిటిసి కాశవేణి మమత-మహేష్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వంగల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దొబ్బల కాంతయ్య, ప్రధాన కార్యదర్శి కొరవేణి రవి, యూత్ అధ్యక్షులు మాసం బాబు ల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వీరికి లక్ష్మీ నరసింహా రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో నూతనంగా చేరిన వారు మాట్లాడుతూ బి.ఆర్.ఎస్ పార్టీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు చల్మెడ లక్ష్మీ నరసింహా రావు నాయకత్వంలోనే వేములవాడ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని భావించి, పార్టీలో చేరినట్లు తెలిపారు.

## ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా కొలిపాక స్వామి

సూర్య, వీణవంక



వీణవంక మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తులు వీణవంక మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీణవంక మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా కోర్కల్ గ్రామానికి చెందిన కొలిపాక స్వామి, ఉపాధ్యక్షుడిగా ఎలబాక గ్రామానికి చెందిన పోలు ఓదెలు, ప్రధాన కార్యదర్శి గా ఎలవేణ సమ్మయ్య, కార్యవర్గ సభ్యులు కొలిపాక నాగరాజు, పోలు ఐలయ్య, ఐలవేణి సదానందం, కొలిపాక కొమురయ్య, పోలు రాజు, మోటం వెంకటేష్, కొత్తపల్లి శంకర్, కలవేణి సమ్మయ్య, ఉప్పరవేణి ఓదేలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులను అన్ని విధాల మేలు జరిగే విధంగా కుల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. సంఘ సభ్యులందరికీ అందుబాటులో ఉండి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. మా ఎన్నికలకు సహకరించిన ప్రతి ఒక్కరికి, కుల బాంధవులకు కృతజ్ఞతలు తెలిపారు.

## యారన్ సబ్సిడీని విడుదల చేయడాన్ని హర్షిస్తూ పాలాభిషేకం

సూర్య సిరిసిల్ల టౌన్



సాధించుకున్న తెలంగాణలో మొట్టమొదటిసారిగా నేతన్నల వ్యక్తిగత రుణాలను మాఫీ చేసిన ఘనత కేసిఆర్, కేటీఆర్ దేనని బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు వెంగళ శ్రీనివాస్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పవర్లూమ్ కార్మికులకు 2021 సంవత్సరానికి సంబంధించిన యారన్ సబ్సిడీ డబ్బులను విడుదల చేయడాన్ని హర్షిస్తూ బిఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో కేసీఆర్,కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా వెంగళ శ్రీనివాస్,అడ్డగట్ల మురళి మాట్లాడుతూ 2021 సంవత్సరానికి సంబంధించిన 10% బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీ దాదాపు 5128 మంది నేత కార్మికుల ఖాతాల్లో దాదాపు 8 కోట్ల 77 లక్షల రూపాయలు జమ కావడం జరిగిందన్నారు.గత ప్రభుత్వాలు పవర్ లూం పరిశ్రమను ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.దిక్కుతోచని పరిస్థితిలో సిరిసిల్లలో ఉపాధి లేక భీమండి, సోలాపూర్,బొంబాయి లాంటి ప్రదేశములకు భార్య పిల్లల్ని,కన్న తల్లిదండ్రులను వదిలిపెట్టి వెళ్లేవారని అన్నారు.తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రభుత్వమే నేరుగా ఆర్డర్లు సిరిసిల్లకు ఇచ్చి మెరుగైన కూలీ రావడంతో నేతన్నల జీవితాల్లో వెలుగులు నిండాయని అన్నారు.ఆకలి చావులు ఆత్మహత్యలు లేకుండా సిరిసిల్లను సిరుల ఖిల్లాగా మార్చిన ఘనత కేసీఆర్,కేటీఆర్ దేనని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో సిరిసిల్ల నుండి ఇతర ప్రదేశాలకు వలస వెళ్లేవారని అన్నారు.ఈ కార్యక్రమంలో వెంగళ వెంకటేశం.మల్లేశం,శ్రీకాంత్, మధు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు వయోవృద్ధులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

సూర్య రాజన్న సిరిసిల్ల.

భారత రాజ్యాంగం కల్పించిన కోట హక్కుని సద్వినియోగం చేసుకోవాలని,దివ్యాంగులకి వయోవృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజ్యం వివరించారు. 21వ తారీకు నుండి 25 వరకు ఫామ్ 12 డి అప్లై చేసుకున్న దివ్యాంగులకు వయోవృద్ధులకు హెూమ్ ఓటింగ్ కు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. దివ్యాంగుల ఇంటి వద్దకే పోలింగ్ సిబ్బంది వచ్చి రహస్య ఓటింగ్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించబడుతుందని ఆయన వివరించారు. దీనికి సంబంధించిన సమాచారము దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు అందరికీ బూత్ లెవెల్ ఆఫీసర్స్ ద్వారా పంపించడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో వీల్ చైర్స్ రాంపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి దివ్యాంగులు మరియు అభివృద్ధిలో కోసం శ్రీమతి సుచరిత మరియు ఓల్డ్ ఏజ్ హెూమ్ సిబ్బంది, డి హబ్ సిబ్బంది, సఖి సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్ పాల్గొన్నారు.








## బిఆర్ఎస్ లో చేరిన బిజెపి శ్రేణులు

### -గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బోయినపల్లి వినోద్ కుమార్

సూర్య రాజన్న సిరిసిల్ల.

కొనరావుపేట మండలానికి చెందిన బిజెపి ఓబీసీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి బి ఆర్ ఎస్ పార్టీలో చేరారు.శనివారం సిరిసిల్లలోని బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు వారిని బీ ఆర్ ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి వినోద్ కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు.కోనరావుపేట మండలం మల్కపేట, ధర్మారం, నాగారం, కొలనూరు గ్రామాలకు చెందిన బిజెపి ఓబీసీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున బీ ఆర్ ఎస్ పార్టీలో చేరారు.బిజెపి ఓబీసీ జిల్లా కార్యదర్శి ఒగ్గు ప్రభాకర్, నాయకులు మిర్యాల్ కర్ హరీష్, జవ్వాది అరవింద్, ఉరడి ఆనంద్ తదితరులు బి ఆర్ ఎస్ లో చేరిన వారిలో ఉన్నారు.



## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు

సూర్య సిరిసిల్ల టౌన్

పండిత్ జవహర్లాల్ పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకొని రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 50 మంది విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాల్గొనడం జరిగింది. ఇందులో కరెస్పాండెంట్ గా వి.రుషి మణిదీప్, ప్రిన్సిపాల్ గా బి.వర్షిని,అకౌంటెంట్ గా ఏ .శ్రీజ,ఇతరులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కరెస్పాండెంట్ నాగుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మకైనా గురువు స్థానాన్ని ఈరోజు విద్యార్థులు చేపడుతూ స్వయం పరిపాలన దినోత్సవం పాఠశాల విధులను ఘనంగా నిర్వహించారు.దీనివలన విద్యార్థులకు ఉపాధ్యాయ వృత్తిపై గౌరవ%శీ% సామాజిక బాధ్యత విలువలతో కూడిన విద్యను పెద్దలయెడ గౌరవముతో చక్కని క్రమశిక్షణ నేర్చుకోవడానికి ఈ బాలల దినోత్సవం ఎంతో గాను తోడ్పడుతుందని అన్నారు.

## కేటీఆర్ గెలుపు కోసం మున్సిపల్ చైర్మన్ ప్రచారం ప్రచారం

సూర్య రాజన్న సిరిసిల్ల



సిరిసిల్ల నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ గెలుపు కోసం సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి గడపగడపకు ప్రచారాన్ని నిర్వహించారు. టిఆర్ఎస్ మేనిఫెస్టో తో ఇంటింటికి తిరిగి కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటించారు. సిరిసిల్ల అభివృద్ధి కొనసాగాలంటే అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే మంత్రి కేటీఆర్ భారీ మెజారిటీతో గెలిపించడం మన అందరి బాధ్యతల్ని అన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ వార్డు అధ్యక్షులు మెరుగు శేఖర్, శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం ధర్మకర్త దూస ఈశ్వరి, విశ్వనాథ స్వామి దేవాలయం ధర్మకర్త గోషిక శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రజలకు వెలుగులు

**- హస్తం పార్టీతో రాష్ట్రం అంధకారం - రైతు రుణమాఫీని ఆపిందే జీవన్ రెడ్డి. - ఎమ్మెల్సీ కవిత**

**సూర్య,రాయికల్**

బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, ప్రజా సంక్షేమంతో ప్రజలకు వెలుగులు అందుతాయని,హస్తం పార్టీని నమ్ముకుంటే రాష్ట్రం అంధకారంతోపాటు అధోగతి పాలవుతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తరఫున ఎమ్మెల్సీ కవిత రాయికల్ పట్టణంతోపాటు, మండలంలోని మైతాపూర్ ,ఇటిక్యాల, భూపతిపూర్ ఎక్స్ రోడ్, కట్కాపూర్,అల్లీపూర్ గ్రామాలలో కార్నర్ రోడ్ షోలో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కారు గుర్తుతోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయని,కాంగ్రెస్ పార్టీ వస్తే రాష్ట్రమంతా కటిక చీకట్లు అలముకుంటాయని ఆమె అన్నారు. బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ,కాంగ్రెస్ పార్టీకి 55 ఏళ్ల పాటు అవకాశం ఇస్తే ఏమీ చేయలేదని,ఇప్పుడు మరొసారి ఒక్క అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ అడగడం విడ్డూరంగా ఉందన్నారు.చెరువులు నిండినా,ఎండిపోయినా చేపలు అక్కడే ఉంటాయి. కానీ కప్పలు మాత్రమే చెరువు నుంచి బయటికి వెళ్తాయని,బీఆర్ఎస్ పార్టీ చేపల వంటిది,కాంగ్రెస్, బీజేపీ నాయకులు కప్పల వంటి వాళ్లన్నారు.ఉద్యమ సమయంలో అధికారంలో లేనప్పుడూ కూడా బీఆర్ఎస్ ప్రజలతో ఉందని, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రజల్లోనే ఉందని అన్నారు.బీఆర్ఎస్ పార్టీ గెలిస్తే ప్రజలు గెలుస్తారని,బీజేపీ గెలిస్తే ఎవరికీ లాభం లేదని స్పష్టం చేశారు.ఉమ్మడి రాష్ట్రంలో అధికారం చెలాయించిన కాంగ్రెస్ తాగు,సాగు నీరు కూడా ఇవ్వలేదని,కాబట్టి మన గురించి మంచి ఆలోచన చేసే బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటేయాలని ఆమె పిలుపునిచ్చారు.రుణమాఫీ నిధులు విడుదల కానివ్వకుండా ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి ఫిర్యాదు చేశారని విమర్శించారు.తెలంగాణ రాక ముందు పరిస్థితి ఎలా ఉండేది,ఇప్పుడు ఎలా ఉందో గమనించాలని కోరారు. పదేండ్ల సీఎం కేసీఆర్ పాలనలో పుష్కలమైన సాగునీటి వనరుల వల్ల రాష్ట్రంలో ధాన్యపు భాండాగా రంగా మారిందని చెప్పారు. దేశంలో తెలంగాణను సీఎం కేసీఆర్ నంబర్ వన్‌గా తీర్చిదిద్దారని,గతంలో పనుల కోసం తెలంగాణ వాసులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారని, ఇప్పుడు పనుల కోసం ఇతర రాష్ట్రాల వాళ్లు తెలంగాణకు వలస వచ్చే పరిస్థతి ఏర్పడిందని ఆమె పేర్కొన్నారు.టీడీపీ, కాంగ్రెస్ హయాంలో బీడీ కార్మికులను కనీసం గుర్తించలేదని, దేశంలో ఎక్కడా లేని విధంగా బీడీ కార్మికులకు పెన్షన్లు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు.కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా ఎన్నికల తర్వాత బీడీ కార్మికులందరికీ రూ.5 వేల పెన్షన్ వస్తుందని తెలిపారు.సౌభాగ్య లక్ష్మి పథకం కింద పేద మహిళలకు నెలకు రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలని, రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు కేసీఆర్ రక్ష బీమా సౌకర్యం కల్పించాలని సీఎం కేసీఆర్ సంకల్పించారని వివరించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపరీతంగా పెంచిన గ్యాస్ సిలిండర్‌ను, సబ్సిడీ కింద రూ.400కే అందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని పేర్కొన్నారు.రైతు బీమా మొత్తం పెంపు,సన్న బియ్యం పంపిణీ గురించి వివరించారు.కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆడపిల్ల పెళ్లికి అండగా నిలిచి ఆపద్బాంధవుడు గా నిలిచిన దేశంలో ఏకైక ముఖ్యమంత్రి కెసిఆర్ అని, అటువంటి పథకాలు ప్రజలకు మళ్లీ అందాలంటే కారు గుర్తుని గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ెఎల్. రమణ, జడ్పీపి చైర్ పర్సన్ దావ వసంత,జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, ఎంపీపీ సంధ్యారాణి జడ్పీటిసీ అశ్విని జాదవ్, మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్లు,వైస్ చైర్మన్ రమాదేవి,పార్టీ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్లు మల్లారెడ్డి,రాజలింగం, రాజారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాణి, వైస్ చైర్మన్ మల్లేశం, కౌన్సిలర్లు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్లు, మాజీ ప్రజాప్రతినిధులు పార్టీ ెనాయకులు పాల్గొన్నారు.







# కెసిఆర్ ను గద్దె దించడమే తెలంగాణ జన సమితి లక్ష్యం

**- ప్రొఫెసర్ యం.కోదండరాం**



**సూర్య జగిత్యాల**

కెసిఆర్ ను గద్దె దించడమే తెలంగాణ జన సమితి లక్ష్యం అని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఉద్యమాల రథసారథి ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శనివారం జగిత్యాల పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్స్ లో జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి అధ్యక్షతన తెలంగాణ జన సమితి కార్యకర్తల, అభిమానుల, ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ యావత్ భారత్ దేశ చరిత్రలో ఇంతటి దౌర్భాగ్య పాలన ఎక్కడా చూడలే.....! అని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ ను గద్దె దించడమే తెలంగాణ జన సమితి లక్ష్యం అని ఆయన నొక్కి వ్యాఖ్యానించారు. కెసిఆర్ ను ఓడిస్తే తప్పా ఆయన అహంకారం అంగదని, రాష్ట్రంలో విచ్చల విడి దోపిడీ నిలిచిపోదు అని రాష్ట్ర ప్రజలు కోరుతున్నారని ఆయన పలు సదర్భాలను వివరించారు. తెలంగాణ ప్రజలకు సరైన న్యాయం జరుగాలన్నా, నిరుద్యోగ సమస్య తీరాలన్నా, ఇతర ఏ సమస్య పరిష్కారం కావాలన్నా కెసిఆర్ ఓటమి పాలైతే తప్పా సాధ్యం కాదు అన్నారు. అందరం పోటీ చేస్తే ఓట్లు చీలి తెలంగాణ దోపిడీ దారులే మళ్లీ గెలువద్దని మేము జన సమితి ద్వారా ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు వారితో పూర్తి స్థాయిలో కలిసి మద్దతు తెలుపడం, కాంగ్రెస్ గెలుపు కు కృషి చేయడం జరుగుతుందని వివరించారు. ఉద్యమ ఆకాంక్షలు, తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన కోసమే కృషి చేస్తామని తెలిపారు. పదేండ్ల పాలన వైఫల్యాలు, దోపిడీ, ప్రభుత్వ - పాలకుల నిర్లక్ష్యం, నిర్బంధాలు, అక్రమాలు, అవినీతి, అరాచకాలు తెలంగాణ ప్రజలకు పూర్తిగా అర్ధమైపోయాయని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి కోరుట్ల, ధర్మపురి నియోజక వర్గాల ఇంచార్జ్ లు కంతి మోహన్ రెడ్డి రెడ్డి, రామగిరి సంతోష్, జగిత్యాల పట్టణ ఇంచార్జి అల్లెంకి శ్రీనివాస్, సిరిసిల్ల జిల్లా నాయకులు బొజ్జ కనకయ్య,, సందేశ్, జహంగీర్, తరుణ్, ప్రముఖ న్యాయవాదులు, ఉద్యమ నాయకులు బండ భాస్కర్ రెడ్డి, రాచకొండ శ్రీరాములు, గోవిందుల రాజన్న, ముద్దం ప్రభాకర్, డాక్టర్ ముస్కు గంగారెడ్డి, బండ శంకర్, పేట భాస్కర్, పోగుల రాజేశం, రాజన్న, చాంద్ పాషా, కొండ్ర జగన్, మైనార్టీ నాయకులు ఖాజా మీర్ అలీ, శరీఫోద్దిన్, విశాల్, పడకంటి లక్ష్మి నారాయణ, పొన్నం రాజమల్లు, కడ రాజన్నలతో పాటు ఉద్యమకారులు, నిరుద్యోగులు, తెలంగాణ జన సమితి కార్యకర్తలు తదితులు పాల్గొన్నారు.

## ఎన్నికల సిత్రం

**నా షర్టు పైన కారు.. నా మనసులో కేసీఆర్...**

11సూర్య బోయినపల్లి



నా షర్టు పైన కారు నా మనసులో కేసీఆర్, కేటీఆర్ సర్ రాబోయేది బిఆర్ఎస్ హైట్రిక్ సర్కార్ అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా లో బోయినపల్లి మండ కేంద్రానికి చెందిన నల్లగొండ అనిల్ కుమార్ గౌడ్ వీరాభిమని తన షర్టు పైన కారు గుర్తు వేసుకొని మా మనసులో కేసీఆర్, కేటీఆర్ సార్ అని ప్రజల దృష్టిని ఆకర్షించేలా కారు గుర్తుకు ఓటేయాలని ప్రచారం సాగిస్తున్నారు.



సూర్య రాయికల్

**ఆడపిల్ల పెళ్ళికి అండ బిఆర్ఎస్**

నూతన వధువును ఆశీర్వదించిన ఎమ్మెల్సీ కవిత, బిఆర్ఎస్ అభ్యర్థి సంజయ్

# ఆంధ్రోళ్ల బూట్లు మోసినోడు వచ్చి ఎట్లపడితే అట్లా చేస్తాంటే ఊకుందామా?

**-సోషల్ మీడియా వేదికగా విషం చిమ్ముతున్న కాంగ్రెస్ ను బొందపెట్టాలె | -రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్**

**సూర్య-గోదావరిఖని:**

ఆనాడు మనమందరం ఉద్యమం చేస్తుంటే... ఆంధ్రోళ్ల బూట్లు మోసినోడు వచ్చి మనపై ఎట్లపడితే అట్లా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ విషం చిమ్ముతున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో చందర్ మాట్లాడుతూ ఇష్టం వచ్చినట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న కాంగ్రెస్ పార్టీ చర్యలకు ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవేశానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు. నవంబర్ 30న జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొందపెట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వారంటీ లేని గ్యారెం టీలతో.. మందిని ముంచే మాటలతో గడబిడ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ చర్యలను ప్రజలు గమనిస్తున్నా రని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఓటమి భయంతో ఆంధ్రా ప్రాంతానికి చెందిన తెలుగుదేశం నాయకులతో కలిసి సోషల్ మీడియా వేదికగా తనపై విషం కక్కుతున్నాడని ఆరోపించారు. గతంలో ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీలు అన్నదమ్ముల్లా హుందాగా ప్రచారం చేసుకొనేవారని, తాము గెలిస్తే ప్రజలకు ఏం మంచి చేస్తామో మాత్రమే చెప్పే వాళ్ళని గుర్తు చేశారు. కానీ ఇవాళ కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న మక్కాన్ సింగ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని టిడిపి యువజన నాయకుడు నాగశ్రావణ్ కిలారు సంస్థ పాలిటిక్స్ ఫర్ ఇంపాక్ట్ ద్వారా జిడికె డిజర్వ్స్ బెటర్ పేరిట ఫేస్ బుక్ వాల్ పై మార్ఫింగ్ చేసిన తన ఫోటోలకు నీచమైన కామెంట్స్, పాటలతో పోస్ట్ చేయించడం పట్ల చందర్ తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు.



ఆ సంస్థకు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఐడి, మెయిల్ తో పేమెంట్ లు చేయడం జరుగుతుందని, న్యూస్ ఏజెన్సీల ద్వారా ఎవరైనా తనకు సంబంధించిన ప్రచారం చేసుకోవచ్చునని, ఆ ఫేస్ బుక్ వాల్ పై ఆయన ఫోటోలు, మేనిఫెస్టోకన్నా మార్ఫింగ్ చేసిన తన ఫోటోలు, నీచమైన కామెంట్లను మాత్రమే పోస్ట్ చేస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్ సింగ్ తన అనుచరులతో షేర్ చేయిస్తూ నిరాధార ఆరోపణలతో.. ఉద్యమకారుడినైన తన క్యారెక్టర్ పై బురదజల్లి, ఎన్నికల్లో లబ్ది పొందాలని చూస్తున్నారని అన్నారు. మాస్క్ లు ధరించిన కొందరు ప్రాంతేతరులు, గుర్తు తెలియని దుండగులు చౌరస్తాలో, రద్దీ ప్రాంతాలలో, తనపై దుష్ప్రచారం చేసే ఇతర ప్రాంతాలలో ముద్రించిన కరపత్రాలు పంచడం, ఫ్లెక్సీలు కట్టడం చేస్తున్నారని ఇది మంచి సంప్రదాయం కాదని సూచించారు. స్థానిక ప్రజలు వారిని గుర్తించేలోగా పారిపోయారన్నారని, వాటికి సంబధిం చిన ఆధారాలన్నీ తమ వద్ద ఉన్నాయని, ఈ విషయాలన్నీ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారం కోసం తనపై నిరాధారమైన ఆరోపణలతో దుర్మార్గమైన కుట్రలకు పాల్పడడం అనైతికమని, అలాంటి వారు సమాజానికి ప్రమాదకరమని, ఇంకా ఎన్ని ఆకృత్యాలకు పాల్పడుతారో చూడాల్సిన దౌర్భాగ్య పరిస్థితి రామగుండం ప్రజలకు దాపురించిందని ఆవేదన, ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మీడియా సమావేశం లో నగర డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పి.టి.స్వామి, కౌశిక హరి, గోపు అయిలయ్య యాదవ్, తానిపర్తి గోపాల్ రావు, నడిపెల్లి మురళీధర్ రావు, చెరుకు బుచ్చిరెడ్డి, తోడేటి శంకర్ గౌడ్, అచ్చే వేణు, జక్కుల తిరుపతి, సింహాచల రత్నాకర్, చల్లగురుగుల మొగిలి, నారాయణదాసు మారుతి, సమ్మెట స్వప్న, రఫిక్, నాగభూషణ్ గౌడ్, రమ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.